ప్రజాశక్తి
బుధవారం 28 ఫిబ్రవరి, 2024
5
శ్రీకాకుళం

డిఎంయు పొడిగింపుపై ఎంపీ హర్షం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా ప్రజలు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్న విశాఖపట్నం-బరంపురం రైలుకు ఆ శాఖ అధికారులు ఆమోదం తెలిపారు. ఇప్పటి వరకు విశాఖ-పలాస మధ్య నడుస్తున్న డిఎంయు రైలు ఇచ్ఛాపురం మీదుగా బరంపురం వరకు కొనసాగిస్తున్నట్లు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. తూర్పుకోస్తా రైల్వే జిఎం మనోజ్‌శర్మ, ఖుర్దా రోడ్ డిఆర్ఎం హెచ్ఎం బజ్వా, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. రైలు పొడిగింపుపై రైల్వే మంత్రి అశ్విన్ శ్రీవైష్ణవ్, వివిధ రైల్వే బోర్డు, డివిజన్ సమావేశాల్లో అధికారులను కలిసి, వినతిపత్రాలు అందించినట్లు గుర్తుచేశారు. ప్రతిపాదనలకు ఆమోదం తెలపడంతో జిల్లాకు చెందిన ఉద్యోగులు, చిరు వ్యాపారులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆకాంక్షించారు.

బురిడికంచరాంలో అస్తవ్యస్తంగా వేసిన పైపులైన్లు

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవస్థలకు చెక్ చెప్పడం, ప్రతి వ్యక్తికీ 55 లీటర్ల సురక్షితమైన తాగునీటిని అందించాలన్నది జలజీవన్ మిషన్ ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగా గామంలోని అన్ని కుటుంబాలకు కుళాయి కనెక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. స్థానికంగా తాగునీటి వనరుల లభ్యత, అవసరమైన చోట అదనపు బోర్లు, ట్యాంకులు, పైపులైన్లు నిర్మించి తాగునీటి సమస్యను అధిగమించడం ప్రధాన కర్తవ్యం. నాలుగేళ్ల కాలపరిమితితో ప్రారంభించిన పనుల్లో ఆశించిన పురోగతి కనిపించడం లేదు. ఈ ఏడాది ముగిసే నాటికి పూర్తి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష్యంగా నిర్ధేశించాయి. మెటీరియల్ కొరత, పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.

జలజీవన్ జాప్యమయ్యేన్...

- **జిల్లాలో మొత్తం గ్రామీణ కుటుంబాలు 5,36,838**
- **ఇప్పటివరకు ఇచ్చిన కుళాయి కనెక్షన్లు 2,20,887**
- **పనులకు ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు**
- **సకాలంలో బిల్లులు చెల్లించకపోవడమే ప్రధాన కారణం!**

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జలజీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా జిల్లాలో 5,36,838 గ్రామీణ కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ధేశించుకున్నారు. మొదటి దశలో 2021-22లో 1,01,585 కనెక్షన్లకు సంబంధించి పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. రెండో దశ కింద 2022-23లో 63,843 కుటుంబాలకు కనెక్షన్లు ఇచ్చారు. 2023-24లో 1,60,847 కుటుంబాలకు కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటివరకు 55,459 కనెక్షన్లు ఇచ్చారు. మొత్తం మీద రెండేళ్లలో కలిపి 2,20, 887 కనెక్షన్లు అందించారు. ఇంకా 3,15,951 కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. జలజీవన్ మిషన్ కార్యక్రమం ప్రారంభించి మూడేళ్లు గడిచినా సగం కుటుంబాలకూ తాగునీటి కనెక్షన్లు ఇవ్వలేకపోయారు. జల జీవన్ మిషన్ ద్వారా జిల్లాలో చేపట్టే పనులను రెండు కేటగిరీలుగా విభజించారు. ఐదు లక్షలు లోపు ఉన్న పనులను ఒక కేటగిరిగా, ఆపై ఖర్చు దాటిన పనులను రెండో కేటగిరిగా వర్గీకరించారు. జలజీవన్ మిషన్ కింద రూ.477.76 కోట్లతో 2,284 పథకాలను మంజూరు చేశారు. అందులో టెండర్లు పూర్తయిన 2,157 పథకాలను సంబంధిత కాంట్రాక్టర్లకు అప్పగించారు. వాటిలో ఇప్పటివరకు 928 పథకాలు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 1174 పథకాలు ప్రగతిలో ఉన్నాయి. వీటితో పాటు పరిస్థితి బాగా ఉన్న కొన్ని పాత పథకాలను జెజెఎం కింద వినియోగించుకునేందుకు 1153 స్కీమ్‌లను గుర్తించారు. వాటి టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు అప్పగించారు. వాటిలో ఇప్పటివరకు ఐదు మాత్రమే పూర్తి స్థాయిలో సిద్ధమయ్యాయి

పనుల్లో కొరవడుతున్న నాణ్యత!

జలజీవన్ కింద చేపడుతున్న పనుల్లోనూ నాణ్యత కొరవడుతోంది. పలుచోట్ల వేసిన ట్యాప్‌లు సైతం విరిగిపోతున్నాయి. కొన్నిచోట్ల కుళాయిలు ఏర్పాటు చేసినా నీటి వనరులేకపోవడతో అవి అలంకారప్రాయంగానే మారుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో అసంపూర్తిగానే జరుగుతాయి.

జాప్యానికి కారణాలివే..

జలజీవన్ మిషన్ పనులు ప్రారంభమై మూడేళ్లు కావొస్తున్నా అనుకున్న స్థాయిలో పనులు ముందుకు సాగడం లేదు. పనులు సకాలంలో పూర్తి కాకపోవడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఒక్కో పనికి రెండు మూడు పర్యాయాలు పిలవాల్సి వస్తున్నట్లు తెలుస్తోంది. కాంట్రాక్టర్లకు ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కొన్ని చోట్ల టెండర్లు వేసేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. జెజెఎం పనులను కేంద్రం, రాష్ట్రం చెరో 50 శాతం వాటా నిధులతో చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం తన వాటా నిధులను విడుదల చేస్తున్నా... రాష్ట్ర ప్రభుత్వం తన వంతు గ్రాంట్‌ను సకాలంలో విడుదల చేయడం లేదని తెలుస్తోంది. దీంతో రాష్ట్ర వాటా నిధులు జమ అయితే గాని, కేంద్రం తన వాటా నిధులను విడుదల చేయడం లేదు. ఫలితంగా కాంట్రాక్టర్లకు భారీగా బకాయిలు ఉన్నట్లు సమాచారం. దీంతో కాంట్రాక్టర్లు పనులపై పెద్ద ఆసక్తి చూపడం లేదనే చర్చ నడుస్తోంది. అదీగాక సకాలంలో మెటీరియల్ రాకపోవడమూ మరో కారణంగా ఉన్నట్లు తెలుస్తోంది. అన్ని జిల్లాల్లోనూ జలజీవన్ పనులు జరుగుతుండటంతో పైపులకు తీవ్ర డిమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది.

మాట్లాడుతున్న గోవిందరావు

జీడికి మద్దతు ధర ప్రకటించాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

జిల్లాలో రైతులు పండించిన జీడి పిక్కలకు మద్దతు ధర రూ.16 వేలు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు డిమాండ్ చేశారు. టెక్కలి సిపిఎం కార్యాలయంలో మండల నాయకులు నంబూరు షణ్ముఖరావు అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 80 కేజీల జీడి బస్తాలకు రూ.16 వేలు చెల్లించాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. గిట్టుబాటు ధరపై టిడిపి తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జీడి రైతులు గిట్టుబాటు ధర లేక రైతులు దళారీలు బారిన పడి తీవ్రంగా దోపిడీకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడికి గిట్టుబాటు ధరిస్తేనే ఉద్దానం అభివృద్ధి చెందుతుందన్నారు. జీడి గిట్టుబాటు ధర ఇవ్వడం ద్వారా విస్తారంగా పంటలు పండించి పరిశ్రమలు అభివృద్ధి చెందుతుందని, తద్వారా వేలాది మందికి ఉపాధి దొరుకుతుందని పేర్కొన్నారు. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరగడం ద్వారా ఉద్దాన ప్రాంతం, గిరిజన ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుందని అన్నారు. అలాగే వలసలను నివారించవచ్చునన్నారు. ఏడాది కాలంగా జీడి రైతులు పోరాటం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి స్పందించకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి జగన్ పలాస వచ్చిన సందర్భంగా లక్ష సంతకాలతో వినతిపత్రం ఇచ్చామన్నారు. జీడి రైతుల సంఘం ప్రతినిధులతో మంత్రి అప్పలరాజు సమక్షంలో చర్చించి నెల రోజులు అవుతుందని అన్నారు. ఇప్పటి వరకు ఆ సారాంశాన్ని ప్రభుత్వం ప్రకటించకపోవడం సరికాదన్నారు. ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం చర్చల పేరుతో జీడి రైతులను మోసం చేస్తుందని వారన్నారు. ప్రభుత్వ వైఖరి వెంటనే బహిర్గతం చేసి జీడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానింగా జీడిపిక్కలు కొనుగోలు జరిగిన తరువాతనే విదేశీ పిక్కలు దిగుమతికు అనుమతించాలన్నారు. జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో జీడి అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. జీడి, మామిడి పళ్లు, పిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపికి టిడిపి, వైసిపి, జనసేనలు మద్దతు ఇవ్వడం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు హెచ్.ఈశ్వరరావు, కొల్లి ఎల్లయ్య, బి.వాసు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సెక్టార్ అధికారులదే కీలకపాత్ర

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల, పోలీసుల పాత్ర కీలకమైందని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సెక్టార్ అధికారులకు, పోలీస్ అధికారులకు ఎన్నికల ప్రక్రియపై మంగళవారం శిక్షణ, అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియపై ప్రతిఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల విధుల్లో చేపట్టాల్సిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించాలని సూచించారు. అలాగే ఎన్నికల్లో తాము చేయకూడని పనులపైనా అవగాహన కలిగి ఉండలన్నారు. చెక్ లిస్ట్, హ్యాండ్ బుక్‌లను క్షుణ్ణంగా చదవాలని కోరారు. రిటర్నింగ్ అధికారులు, సెక్టార్ అధికారులు తమ పరిధిలోని ప్రతి పోలింగ్ స్టేషన్‌నూ సందర్శించాలన్నారు. వారి పరిధిలోని పోలింగ్ స్టేషన్ల నిర్వహణపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి వసతుల విషయమై లోటుపాట్లు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన కొత్త నిబంధనల ప్రకారం ఎన్నికలను నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని హెచ్చరించారు. శిక్షణ పొందిన రోజు నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాస్టర్ శిక్షకులు, నోడల్ అధికారులుగా ఎం.కిరణ్‌కుమార్, కె.శేషగిరిరావు ఎన్.బాలాజీలు వ్యవహరించారు. ఎన్నికల ప్రక్రియపై, పోలింగ్‌కు ముందు, పోలింగ్ సందర్భంలో, పోలింగ్ తర్వాత చేయాల్సిన విధుల గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులకు అవగాహన కల్పించారు. అదనపు ఎస్‌పి ప్రేమకాజల్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, డిఎస్‌పి విజయ్ కుమార్, 30 మండలాల నుంచి సెక్టార్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ నమజీర్ జిలానీ సమూన్

'ఉపాధి' ఉద్యోగుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉపాధి హామీ చట్టంలో విధులు నిర్వహిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇతర సిబ్బంది తమ డిమాండ్ల సాధన కోసం ఉన్నతాధికారులకు సమ్మె నోటీసులు ఇచ్చారు. రాష్ట్ర ఉపాధి హామీ ఉద్యోగుల జెఎసి చైర్మన్ వై.వి.రమణ సూచనల మేరకు ఆ సంఘం నాయకులు రత్నాకర్, సుజాత, బి.వి.రమణమూర్తి ఈ నోటీసులను కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌కు, డ్వామా పీడీ చిట్టిరాజులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఎంపిక కమిటీ ద్వారా రిజర్వేషన్ పద్ధతిలో ఉద్యోగాల్లో చేరిన తమకు తగిరి స్థాయిలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దశాబ్దాలు గడుస్తున్నా ఎటువంటి ఆర్థిక ప్రయోజనాలు పొందలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగకపోవడంతో తమ కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాయని అన్నారు. ఈ విషయాన్ని రాష్ట్రస్థాయి అధికారులకు తెలియజేసినా వారు కనీస స్థాయిలో కూడా స్పందించడం లేదని వాపోయారు. తమ డిమాండ్ల సాధనకు సమ్మె ఒకటే పరిష్కారమని భావిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల అభివృద్ధి అధికారులకు సమ్మె నోటీసులను అందజేశామని చెప్పారు. పిఆర్‌సి వర్తింపు ఉద్యోగులను గ్రేడ్‌లుగా వర్గీకరణ వేతనాల పెంపు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఎఫ్‌టియిలుగా మార్చడం వంటి డిమాండ్లతో ఈ నోటీసులు అందజేశామని పేర్కొన్నారు. రాష్ట్ర గ్రామీణ అభివృద్ధిశాఖ కమిషనర్ కూడా అందజేశామని చెప్పారు. వారం రోజుల్లోగా తమ డిమాండ్లు పరిష్కరించాలని, లేకుంటే సమ్మె తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో రత్నాకర్, సుజాత, బి.వి.రమణమూర్తి, వెంకటరమణ, అరుణ, ఎస్.సుబ్రహ్మణ్యం, ఎన్.రామకృష్ణ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న ఉద్యోగులు

పట్టణ పేదలకు 'ఉపాధి' కల్పించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

పట్టణ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న పేదలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని, దీనికి ఉపాధి చట్టం తీసుకురావాలని వ్యవసాయ కార్మిక సంగం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని సిలగాం సింగువలస, బెండివానిపేట గ్రామాల్లో మంగళవారం కూలీలతో మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతుందన్నారు. రూ.లక్ష కోట్ల బడ్జెట్ ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని దశల వారీగా నిధులు తగ్గిస్తూ... ప్రస్తుతం రూ.66 వేల కోట్లకు పరిమితం చేశారని అన్నారు. అంతే 30 శాతం కోత పెట్టారని వివరించారు. గతంలో తాగునీటి సౌకర్యం కల్పించేవారని అన్నారు. గునపాలకు, పారలకు పదును పెట్టడానికి డబ్బులు చెల్లించేవారని గుర్తు చేశారు. నీడ కోసం టెంట్లు వేసేవారని, మెడికల్ కిట్లు ఇచ్చే వారని, అవన్నీ అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఏటా ఉపాధి హామీకి బడ్జెట్‌లో నిధులు కోత విధించడం తగదన్నారు. శ్రీకాకుళం నగరం చుట్టూ ఉన్న ఏడు విలీన పంచాయతీల్లో ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు.



కూలీలతో మాట్లాడుతున్న సింహాచలం

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సేకరణకు ప్రతిపాదనలు

సబ్ కలెక్టర్, ఆర్‌డిఒలకు జెసి నవీన్ ఆదేశం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని, ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా స్థల సేకరణకు ప్రతిపాదనలు తక్షణమే పంపాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఆదేశించారు. జర్నలిస్టుల హౌసింగ్ పథకంపై కలెక్టరేట్‌లో రెవెన్యూ, ఐఅండ్‌పిఆర్ అధికారులతో మంగళ వారం సమావేశం నిర్వహించారు. టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, పలాస, శ్రీకాకుళం ఆర్‌డిఒలు డాక్టర్ భరత్ నాయక్, సిహెచ్.రంగయ్య లు వర్చువల్‌లో పాల్గొన్నారు.

టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ టెక్కలిలో ప్రభుత్వ భూమి అందుబాటులో లేదని, సమీప గ్రామాల్లో ప్రభుత్వ, ప్రయివేటు భూముల ను పరిశీలిస్తున్నామని వివరించారు. పలాస డివిజన్‌లో స్థలాన్ని గుర్తించడం పూర్తయిందని, దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోందని ఆర్‌డిఒ భరత్ నాయక్ తెలిపారు. శ్రీకాకుళం డివిజన్ లో ఆమదాలవలస, తిమ్మాపురం, బూర్జ, సరుబుజ్జిలి, లావేరు మండలాల్లో ఇప్పటికే స్థలాలను పరిశీలించామని ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య వివరించారు. అనంతరం జెసి మాట్లాడుతూ 349 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా వచ్చాయని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని అన్నారు. పథకం పర్యవేక్షణ కమిటీ సభ్యులు శాసపు జోగినాయుడు, వి.సన్యాసినాయుడు మాట్లాడుతూ గతంలో జగనన్న కాలనీల్లో ఒక సెంటు ఇళ్ల పట్టాలను సుమారు 60 మంది జర్నలిస్టులు పొంది ఉన్నారని అన్నారు. వారికి ఈ పథకంలో పట్టా పొందడానికి అనుమతించాలని, లేనిపక్షంలో ఆ పట్టాలను తిరిగి ప్రభుత్వానికి అప్పగించి కొత్తగా హౌసింగ్ పథకంలో పట్టా పొందడానికి అనుమతించాలని కోరారు. వచ్చే నెల 2న దీనిపై చర్చించుకునేందుకు తిరిగి సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని జెసి తెలిపారు. సమావేశంలో సభ్యులు డిఐపిఆర్ఒ కె.చెన్నకేశవరావు, డిపిఆర్ఓ కె.బాలమాన్‌సింగ్, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ నరసింహమూర్తి పాల్గొన్నారు.

క్రీడాకారులపై వైసిపి అనుచిత ప్రవర్తన

- **ఆంధ్రా క్రికెట్ జట్టుపై క్రీడల మంత్రి రోజా పెత్తనం**
- **టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్**

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో క్రీడల వ్యవస్థను వైసిపి నాశనం చేసిందని, క్రీడాకారులపై అనుచితంగా ప్రవర్తిస్తూ రాష్ట్ర గౌరవాన్ని పర్యటక, క్రీడలశాఖ మంత్రి రోజా మంటగలుపుతున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ ధ్వజమెత్తారు. నగరంలోని జిల్లా టిడిపి కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఆడుదాం ఆంధ్రా పేరిట కొనుగోలు చేసిన క్రీడా కిట్లు కొనుగోళ్లలో పెద్దఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయని విమర్శించారు. కేవలం కమిషన్ల కోసం నాసిరకం కిట్లు కొనుగోలు చేసి క్రీడాకారులకు విస్మయానికి గురిచేశారన్నారు. దీనికి తోడు ఆంధ్రా క్రికెట్ జట్టు కెప్టెన్‌గా ఉన్న సుదీర్ఘ అనుభవం, సమర్థత గల క్రీడాకారుడు విహారి ని కెప్టెన్సీ నుంచి తప్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏనాడూ క్రికెట్ మైదానం ముఖం చూడని, క్రికెట్ ఆడే సత్తా లేని వైసిపి నాయకుని కుమారునికి కెప్టెన్సీని కట్టబెట్టడం కోసం విహారిని తొలగించి క్రీడాకారులనే అవమానించారని విమర్శించారు. రాష్ట్రం తరుపున ఇక ఎప్పటికి ఆడబోనని విహారి ప్రకటించడం క్రీడల శాఖ మంత్రి రోజాకు సిగ్గుచేటన్నారు. నాసిరకం కొనుగోళ్లపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబు సభ విజయవంతం

ప్రజాదరణ చంద్రబాబుకు చెక్కు చెదరలేదనడానికి శ్రీకాకుళం రా కదలిరా సభ నిదర్శనమని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ పేర్కొన్నారు. జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చిన టిడిపి శ్రేణులు, చంద్రబాబు అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి సిద్ధం సభకు ఆర్‌టిసి బస్సుల్లో బలవంతంగా, ఒత్తిడి చేస్తే వచ్చిన జనం కంటే శ్రీకాకుళం సభకు అధిక సంఖ్యలో స్వచ్ఛందంగా వచ్చారని అన్నారు. ఇక వైసిపికి పతనం మొదలైందనడానికి ఈ సభ తార్కాణమన్నారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. సమావేశంలో టిడిపి ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు, బొణిగి భాస్కరరావు, రైతు విభాగం రాష్ట్ర నాయకులు సింతు సుధాకర్, ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.రమణ మాదిగ, నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రవికుమార్

అరసవల్లి హుండీ ఆదాయం రూ.60 లక్షలు

- **స్వదేశీ కరెన్సీ ద్వారా రూ.59.10 లక్షలు**
- **31 గ్రాముల బంగారం, 600 గ్రాముల వెండి**

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలోని హుండీల ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. 23 రోజుల పాటు హుండీల్లో యాత్రికులు వేసిన కానుకల ద్వారా సుమారు రూ.60 లక్షల వరకు ఆదాయం సమకూరింది. స్వదేశీ నోట్లు రూపంలో రూ.57,61,049, చిల్లర నాణేలు రూపంలో రూ.1,49,726 కలిపి మొత్తం రూ.59,10,775 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఇఒ డి.ఎల్.వి.రమేష్‌బాబు తెలిపారు. నగదుతో పాటు 31 గ్రాముల బంగారం, 600 గ్రాముల వెండి హుండీల్లో లభ్యమైనట్టు తెలిపారు. వీటితో పాటు విదేశీ మారక ద్రవ్యం యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా 9 డాలర్లు, నేపాల్ రాష్ట్ర బ్యాంకు రూ.25, సౌదీ అరేబియన్ మోనేటరీ 10 రియల్స్, ఖతార్ సెంట్రల్ బ్యాంకు 10 రియల్స్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఒమాన్ 100 బైసా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ 140 దిర్హామ్స్ లభ్యమైనట్టు చెప్పారు. ఈ లెక్కింపును జిల్లా దేవదాయ శాఖ అధికారి ప్రసాద్ పట్నాయక్, ఆలయ అనువంశిక ధర్మకర్త ఇప్పిలి జోగి సన్యాసిరావు, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు జలగడుగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సేవకులు

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE (SPICAL MOBILE COURT AT SRIKAKULAM O.S. 251/2023

Between: **Patrudu Rama Krishna** ...Plaintiff

And: **Korada Sireesh** ...Defendants

To,

D-1. Korada Sireesh S/O Late amakrishna Rao, Age 47 Years, Business, R/O Door No: 11-361, Siva Nagar Colony, Narasannapeta Village/Post and Narasannapeta Mandalam, Srikakulam District.

D-2. Korada Laxmi W/O Korada Sireesh, Age 44 Years, Business, R/O Door No: 11-361, Siva Nagar Colony, Narasannapeta Village/Post and Narasannapeta Mandalam, Srikakulam District.

పై నెంబరు దావాలో మీకు నోటీసులు సర్వీస్ గానందున పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు నిమిత్తం **తేది 29-02-2024న** వాయిదా యున్నది గనుక సదరు వాయిదాకు మీరు స్వయంగా గాని లేదా అడ్వకేటు ద్వారా గాని కోర్టుకు పై **తేదిన ఉదయం 10.30 గం॥లకు** హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియ పరుచు కొనవలెను. లేనియెడల మీపరోక్షమున విచారించి తీర్మానించడమగునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

BEHARA TIRUMALA RAO
Advocate, Srikakulam,
Cell: 7013736600.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE (SPICAL MOBILE COURT AT SRIKAKULAM I. A. 70/2023 in O.S.251/2023

Between: **Patrudu Rama Krishna** ...Petitioner/Plaintiff

And:**Korada Sireesh** ...Respondent/Defendants

To,

R-1. Korada Sireesh S/O Late amakrishna Rao, Age 47 Years, Business, R/O Door No: 11-361, Siva Nagar Colony, Narasannapeta Village/Post and Narasannapeta Mandalam, Srikakulam District.

R-2. Korada Laxmi W/O Korada Sireesh, Age 44 Years, Business, R/O Door No: 11-361, Siva Nagar Colony, Narasannapeta Village/Post and Narasannapeta Mandalam, Srikakulam District.

పై నెంబరు దావాలో మీకు నోటీసులు సర్వీస్ గానందున పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు నిమిత్తం **తేది 29-02-2024న** వాయిదా యున్నది గనుక సదరు వాయిదాకు మీరు స్వయంగా గాని లేదా అడ్వకేటు ద్వారా గాని కోర్టుకు పై **తేదిన ఉదయం 10.30 గం॥లకు** హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియ పరుచు కొనవలెను. లేనియెడల మీపరోక్షమున విచారించి తీర్మానించడమగునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

BEHARA TIRUMALA RAO
Advocate, Srikakulam,
Cell: 7013736600.

మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

నీటిఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో గ్రామీణ రక్షిత నీటి పథకం నిర్వహణ, జలజీవన్ మిషన్‌పై మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి సత్వర ప్రణాళికలు రూపొందించాలన్నారు. గ్రావిటేషన్ ప్రకారం తాగునీరు అందించాల్సిన కొండ ప్రాంత గ్రామాలను గుర్తించాలన్నారు. అలాగే తీరం వెంబడి ఉన్న నేలబావులు, గొట్టపు బావుల్లో భూగర్భజలాలు అడుగంటి పోవడం వల్ల ఉప్పునీరు బావులోకి చేరుతుందని పేర్కొన్నారు. దీనివల్ల తాగునీటికి తీర ప్రాంత గ్రామాల్లో ఎద్దడి ఏటా ఎదురవుతోందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అలాగే ఫ్లోరైడ్, నైట్రేట్, సిలికాన్ వంటి పరీక్షలు చేపట్టేందుకు ల్యాబ్‌లను సిద్ధం చేసినట్టు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ప్రసాదరావు తెలిపారు. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ టి.ఎస్.ప్రసాదరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇలు జి.జాన్ బెన్హర్, ఆశాలత, జెడ్‌సి డిప్యూటీ సిఇఒ వెంకటరామన్, ఇఇలు, డిఇలు, ఎఇలు, పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- సోంపేట

తురక శాసనం గ్రామంలో మంగళవారం సిసి రోడ్డు పనులకు స్థానిక ఎమ్మెల్యే బి.అశోక్ శంకుస్థాపన చేశారు. ఎంపీ ల్యాడ్ నిధుల నుంచి ఈ రోడ్డు పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. టిడిపి హయాంలో గ్రామాల అభివృద్ధి జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును సిఎంగా గెలిపించాలని కోరారు. సర్పంచ్ లక్ష్మీ లింగరాజు, నాయకులు వెదుళ్ల హరికృష్ణ, చంద్రమోహన్ పాల్గొన్నారు.

ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

రూ.491 కోట్లతో 'ఉపాధి' పనులు

ప్రజాశక్తి- లావేరు

జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.491 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని, ఆ పనులు చేపట్టడం జరుగుతుందని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు తెలిపారు. మంగళవారం 2022-23లో చేపట్టిన పనులకు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రూ 18 .3 కోట్లుతో చేపట్టిన పనులకు పంచాయతీల వారీగా సామాజిక తనిఖీలు నిర్వహించారు. రూ.15.3 కోట్లు కూలీలకు చెల్లించినట్లు తెలిపారు. రూ.2.80కోట్లు మెటీరియల్ కంపోనెంట్ కింద చెల్లింపులు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో భూగర్భ జలాలు పెంపునకు వివిధ రకాల పారం పాండ్లు, కంథకాలు, తీసేందుకు రూ.1991 పనులకుగాను రూ.22 కోట్లుతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. సామాజిక తనిఖీల్లో కూలీలు హాజరు నమోదులో దిద్దుబాట్లు ఉన్నట్టు గుర్తించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యతాయుతంగా పనులు చేపట్టాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపిడి మురళీకృష్ణ, విజిలెన్స్ అధికారులు లోవరాజు, ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, ఎంపిడిఒ జి. భాస్కరరావు, ఎపిఒ రెడ్డి సత్యవతి, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సొండి కులస్తులు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలో తీరప్రాంతం దొంకురు గ్రామానికి చెందిన క్యాన్సర్ బాధితుడికి కొర్లా సొండి కులస్తులు రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. కొర్లాం గ్రామానికి చెందిన గణేష్ కొన్నేళ్ల క్రితం ఇచ్ఛాపురం మండలం దొంకురు గ్రామానికి వెళ్ళి అక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నారు. తెలియని అనారోగ్య సమస్యతో బాధపడుతున్న గణేష్ ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తున్న గణేష్‌కు క్యాన్సర్ సోకినట్లు డాక్టర్లు చెప్పారు. నిరుపేద కుటుంబానికి చెందిన గణేష్ వైద్యసేవలు చేయించుకోలేని విషయం తెలుసుకున్న కొర్లాం సొండికుల సంఘానికి విషయం తెలియడంతో దొంకూరు వెళ్లి ఆర్థికసాయం అందజేసినట్లు రాష్ట్ర సొండికుల కోశాధికారి రత్నాల శ్రీనివాసరావు తెలిపారు. బాధితుడికి సహాయం చేయాలనుకునే దాతలు 023010100130283 రత్నాల నీలావతి, ఫోన్ పే నంబర్ 93929 52059 ఎం.అనూషలకు పంపించి, శ్రీనివాస్ వాట్సప్ (9963484335) స్క్రీన్ షాట్ పంపించాలని కోరారు.

వీల్‌చైర్ వితరణ

ప్రజాశక్తి- కవిటి

మండలం బొరివంక గ్రామానికి చెందిన హెల్పింగ్ హేండ్స్ సంస్థ మరోసారి తన ఔదార్యం చాటుకుంది. మండలంలోని బొరివంక గ్రామానికి చెందిన డి.లక్ష్మణరావు రోడ్డు ప్రమాదానికి గుర్రై గత ఐదేళ్లగా మంచానికే పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న హెల్పింగ్ హేండ్స్ సభ్యుడు కాళీ సాహు సీతయ్య ఫౌండేషన్ సహకారంతో లక్ష్మణరావుకు వీల్ చైర్ ఏర్పాటు చేశారు. మంగళవారం సంస్థ సభ్యులు ఆధ్వర్యంలో యువైసి సంస్థ సమక్షంలో లక్ష్మణరావుకు వీల్ చైర్‌ను అందించారు. కార్యక్రమంలో ఎంపిటిసి డి.సతీష్, హెల్పింగ్ హేండ్స్ సభ్యులు, యువైసి సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వీల్ చైర్‌తో లక్ష్మణరావు

ఆనాటి 'దర్జా' ఏదీ!

- విస్తరిస్తున్న రెడీమేడ్ రంగం
- ప్రభుత్వ ప్రోత్సాహకాలు కరువు
- నేడు ప్రపంచ టైలర్స్ దినోత్సవం

సమాజంలో సామాన్యుడు మొదలు అత్యున్నతస్థానం అలంకరించే అమాత్యులు, అధికారులు, సినీ కళాకారులు వరకు దర్జీ వృత్తిదారులతో సంబంధాలు ముడిపడి ఉంటాయి. కానీ వారి నుంచి దర్జీలు ఆర్జించగలిగేది ప్రశంసలు మాత్రమే. దర్జీలకు వయసు మళ్లిన తరువాత బతుకు బరువు కావడంతో పాటు సానుభూతి మాత్రం మిగులుతుందన్న ఆవేదన వ్యక్తం అవుతుంది.

ప్రజాశక్తి- రణస్థలం

ప్రభుత్వాలెన్ని మారినా ప్రోత్సాహకాలు లేకపోవడంతో దర్జీల జీవితాలు దర్జాకు దూరం అవుతున్నాయి. ప్రత్యేకించి ప్రస్తుతం ఫ్యాషన్ రంగం విస్తరించడం, అందుకు ధీటుగా రెడీమేడ్ షోరూంల ఏర్పాటుతో టైలర్స్ ఆర్థికాభివృద్ధికి దూరమవుతున్నారు. ఏళ్ల తరబడి తమ హక్కుల కోసం, ప్రభుత్వ ఆదరణ కోసం ఆశగా ఎదురు చూస్తున్న టైలర్స్‌తో పాటు అదే వృత్తికి అనుబంధంగా ఉన్న కార్మికులు, మహిళలు నిరాశ చెందుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో పది వేలకుపైగా స్త్రీ, పురుషులు, యువత టైలరింగ్‌నే నమ్ముకుని కుటుంబాలను నెట్టుకొస్తున్నారు.

ఫ్యాషన్‌పై యువత మోజు...

నేడు అన్ని వయసుల వారికి రెడీమేడ్ దుస్తులు అందుబాటులోకి వచ్చాయి. ఫ్యాషన్ రంగం విస్తరించింది. టీషర్టు, జీన్స్ ప్యాంటు, షాట్‌లు రకరకాల దుస్తులు మార్కెట్లోకి వచ్చాయి. యువత ఆసక్తిని ఆదాయవనరులుగా మార్చుకునేందుకు పెద్ద బ్రాండెడ్ కంపెనీలు నగరాలతో పాటు చిన్నచిన్న పట్టణాలు, గ్రామాలకు సైతం ఇబ్బడి ముబ్బడిగా వెలిశాయి. దీంతో సామాన్యుడు సైతం స్టైల్ పట్ల ఆకర్షితుడై రెడీమేడ్ వైపు మక్కువ చూపడంతో టైలరింగ్ షాపుల మెట్లు ఎక్కేవారు క్రమేణా తగ్గి పోతున్నట్టుగా పలువురు టైలర్స్ వెల్లడిస్తున్నారు. అదేవిధంగా మహిళలు సైతం నేడు పంజాబీ డ్రెస్, లెగిన్‌ప్యాంట్లు, మగవారితో సమానంగా జీన్స్, టీషర్ట్స్ వినియోగంపై ఏ మాత్రమూ

టైలరింగ్ షాపులో దుస్తులు కుడుతున్న టైలర్లు

వెనుకడుగు వేయకపోవడంతో అంతా రెడీమేడ్ ప్రపంచంగా మారుతోంది. దీంతో ఆరు నెలల పని ఉంటే, మరో ఆరు నెలలు పనిలేక ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు దుస్తులు తయారీకి సంబంధించిన మెటీరియల్ ధరలు పెరుగుదలకు అడ్డూ అదుపులేకుండా పోయింది. ఈ కారణంగా కుట్టుకూలీ ఎక్కువ చేయాల్సిన దుస్థితి. టైలరింగ్ షాపులను కూడా వ్యాపార సంస్థల కింద పరిగణించి విద్యుత్ చార్జీలు వసూలు చేస్తున్నారు. ప్యాంట్, షర్టు జత కుట్టు కూలీ చెప్పుకునేందుకు రూ.600 అయినా అవి తయారు చేసేందుకు రూ.400లకు పైబడి ఖర్చు అవుతోంది. జత దుస్తులు ఇస్త్రీ చేయిస్తే రూ.20 తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. ఇక షాపు అద్దెలు, కరెంటు బిల్లులు చెల్లించి మిగిలేది కూలీ గిట్టుబాటే. రెక్కాడితేకాని డొక్కాడని దర్జీలు వృద్ధాప్యంలో కంటిచూపు కొరబడి అనారోగ్యానికి గురవడం సహజం. దీంతో సంబంధం లేని వృత్తులైన ఆటోడ్రైవర్లు, పరిశ్రమల్లో రోజు కూలీలుగా, సెక్యూరిటీ గార్డులుగా, వాచ్‌మేన్లుగా, పెయింటర్స్‌గా పనికి పోవాల్సిన పరిస్థితి ఉందని గోడు వెళ్లగక్కుతున్నారు.

మహిళలకు స్వయం ఉపాధి

సామాన్య కుటుంబాలకు చెందిన మహిళలు ఎందరో ఆర్థిక ఇబ్బందులు తీర్చుకునేందుకు స్వయం ఉపాధిగా టైలరింగ్‌ని ఎంచుకుంటున్నారు. ఇంటి పనులు చక్కదిద్దుకొని ఆదాయవనరులు పెంపొందించుకునేందుకు గృహిణులకు టైలరింగ్ దోహదపడుతోంది. టైలరింగ్‌ను చాలామంది మహిళలు స్వయం ఉపాధిగా మల్చుకోవడంతో మహిళల దుస్తులు కూడా కుట్టడానికి రావడం లేదని టైలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుట్టు మిషన్ ఆవిర్భావం ఇలా...

పూర్వం సూది, దారం ఉపయోగించి చేతితో దుస్తులు కుట్టుకునేవారు. జర్మనికి చెందిన విలియమ్స్ చే తన భార్య దుస్తులు కుట్టుకునేందుకు పడుతున్న అవస్థలు గమనించాడు. 1846లో తన దేశంలో 11 నెలలు ఎంతో కష్టపడి ఫిబ్రవరి 28న కుట్టుమిషన్‌ను కనిపెట్టారు. అప్పటినుంచి ప్రపంచ వ్యాప్తంగా కుట్టుమిషన్లు వినియోగంలోకి వచ్చాయి. దీంతో ఫిబ్రవరి 28న ప్రపంచ వ్యాప్తంగా దర్జీల దినోత్సవం జరుపుకుంటారు.

డిమాండ్లు...

దర్జీలు ప్రభుత్వ ఆదరణ కోసం ఎదురు చూస్తున్నారు. టైలర్స్‌కు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి. నివాసస్థలాలతో పాటు ఇళ్ల నిర్మించుకునేందుకు నిధులు కేటాయించాలి. చేనేతల మాదిరిగానే 50 ఏళ్లకు పింఛన్లు, పిల్లల చదువులకు ఫీజుల చెల్లిం పుల్లో రాయితీలు, టైలరింగ్ షాపులకు విద్యుత్ ఛార్జీలు విధింపులో రాయితీ కల్పించాలని దర్జీలు కోరుతున్నారు.

జీవన భృతి వర్తింపజేయాలి

27 ఏళ్లుగా టైలరింగ్ వృత్తిని నమ్ముకుని జీవితం సాగిస్తున్నాను. రెడీమేడ్ దుస్తులతో మా వ్యాపారా నికి తీవ్రంగా గండి పడింది. రెండున్నర దశాబ్దాలుగా పని చేస్తున్నా మిగిలిందేమీ లేదు. పని ఉన్న సమయంలో వచ్చిన డబ్బులతోనే కుటుంబ అవసరాలు తీరుతాయి. పని లేకుంటే అప్పులు చేయాల్సిందే. చేనేత కార్మికులు, గీత కార్మికులకు ఇచ్చినట్టు టైలర్లకు కూడా జీవనభృతిని వర్తింపజేయాలి..

– డి.వెంకటేష్,
టైలరింగ్ సంఘ నాయకులు, జె.ఆర్.పురం

సంక్షేమానికి కృషి చేయాలి

మూడు దశాబ్దాలుగా టైలర్‌గా పని చేస్తున్నాను. రెడిమేడ్ దుస్తులతో గిరాకీ తగ్గింది. పని ఉన్నప్పుడు రోజుకు రూ.300 వరకు సంపాది స్తున్నా టైలరింగ్ రంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ఎలాంటి కృషి చేయడం లేదు. అర్హులైన పేదవారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించి ప్రభుత్వం ఆదుకోవాలి. బ్యాంకు రుణాలు అందిస్తే టైలరింగ్ రంగం రాబోయే రోజుల్లో కొంత మెరుగ్గా ఉంటుంది.

– బుడుమూరు రామకృష్ణ, కృష్ణాపురం

కుల వృత్తి కూడు పెట్టడం లేదు

మా కుటుంబం తరతరాలుగా కుల వృత్తినే నమ్ముకుని జీవిస్తోంది. నేను కూడా సుమారు ఇరవై ఏళ్లుగా ఈ వృత్తిలో ఉన్నారు. గతంలో చేతినిండా పని ఉండేది. రెడీమేడ్ దుస్తుల రాకతో పరిస్థితి మారింది. మాకు పనిదొరకడం లేదు. చేయడానికి పనిలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. కుల వృత్తిపై ఆధారపడిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలి.

– అర్జీ గోవింద్, టైలర్, రణస్థలం

రూ.673 కోట్లతో 'నాడు-నేడు' పనులు

ఎపిఇడబ్ల్యుఐడిసి ఛైర్మన్ నాగార్జున యాదవ్

ప్రజాశక్తి- పలాస

జిల్లాల్లో 2016 పాఠశాలల్లో రూ.673 కోట్లతో నాడు-నేడు నిధులతో పాఠశాల భవనాలను అధునికీకరణ పనులు చేపట్టడం జరుగుతుందని ఎపి ఇడబ్ల్యుఐడిసి ఛైర్మన్ నాగార్జున యాదవ్ తెలిపారు. కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులు, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో సౌకర్యాలు ఎలా ఉన్నాయి, మధ్యాహ్న భోజనం రుచిగా ఉందా లేదా, సక్రమంగా ఆహారం అందరికి అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో సిఎం జగన్మోహన్‌రెడ్డి పాఠశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టి విద్యకు పెద్దపీట వేశారన్నారు. అందులో భాగంగా జిల్లాలో 2016 పాఠశాలల్లో రూ.673 కోట్లుతో నాడు నేడు పేరుతో పాఠశాలలో భవనాలు, ఇతర సౌకర్యాలు ఆధునీకరణ పనులు చేపట్టడం జరిగిందని, ఇప్పటికే ఫేజ్-1లో పనులు పూర్తయ్యాయని, ఫేజ్-2 పనులు జరుగు తున్నాయని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా పర్యటించి పనులు పరిశీలించడం జరిగిందని, పనులు సంతృప్తికరంగా జరుగుతున్నాయన్నారు. కాశీబుగ్గ జెడ్‌పి హైస్కూల్‌కు సంబంధించి ఫేజ్1లో రూ.కోటి 70 లక్షలతో పనులు పూర్తయ్యాయని, ఫేజ్-2లో రూ.2.36 కోట్లతో నాడు నేడు పనులు జరుగుతున్నాయన్నారు. అదనపు తరగతి గదులు, పెయింటింగ్ పనులు జరగాల్సి ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా డిజిటల్ క్లాస్ రూంలు ఏర్పాటు చేయడం జరిగిందని, 8,9 తరగతులకు ట్యాబ్‌లు అందించడం జరిగిందని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన ఆహారం అందించడం జరుగుతుందన్నారు. డిఇఇ మూర్తి, ఎఇ రాజేంద్ర, సునీల్, హెచ్‌ఎం చిన్నం నాయుడు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అలేఖ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

పలాస : మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న నాగార్జున యాదవ్

ఇచ్ఛాపురం: మండలం, మున్సిపాలిటీ పరిధిలో నాడు నేడు అబివృద్ధి పనులపై రాష్ట్ర మనబడి ఛైర్మన్ యనమల నాగార్జున యాదవ్ విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మున్సిపల్ బాలికోన్నత పాఠశాలల్లో మనబడి నాడు-నేడు అభివృద్ధి పనులు పరిశీలించారు. కార్యక్రమంలో జెఇ సునీల్ కుమార్, సీడప్ ఛైర్మన్ సాడి శ్యాంప్రసాద్, ఎంపిపి బోర పుష్ప, మున్సిపల్ వైస్ ఛైర్మన్ భారతి దివ్య, వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్, ఉప్పాడ రాజారెడ్డి పాల్గొన్నారు.

టెక్కలి: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గతేడాది జరిగిన నాడు నేడు పాఠశాల భవనాల పనులను ఎపిఇడబ్ల్యుఐడిసి ఛైర్మన్ నాగార్జున యాదవ్ పరిశీలించారు. పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అర్ధాంతరంగా నిలిచిన పనులను తక్షణమే పూర్తి చేయాలని ఇంజనీరింగ్ ఆధికారి కుప్పిలి గణేష్‌ను ఆదేశించారు. ఈయనతో పాటు పాఠశాల హెచ్‌ఎం దాసరి నాగభూషణం, ఇన్‌ఛార్జి ఉపాధ్యాయులు రోణంకి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మిర్చిలోడు లారీలో మంటలు

ప్రజాశక్తి- పలాస

మండలం లక్ష్మీపురం టోల్‌గేట్ జాతీయ రహదారిపై మిర్చిలోడు లారీ అగ్ని ప్రమాదానికి గురైంది. గుంటూరు నుంచి పాట్నాకు మిరపకాయల లోడుతో వెళ్తున్న లారీలో టోల్ గేటు దగ్గరకు వచ్చేసరికి లారీలోని వీల్స్ సెంటర్ జాయింట్‌లో ఏర్పడిన సాంకేతిక లోపం వలన మంటలు చెలరేగాయి. డ్రైవర్, క్లీనర్ అప్రమత్తమై వాహనాన్ని హైవేపై నిలిపి వేశారు. కాశీబుగ్గ అగ్నిమాపక సిబ్బంది సమాచారం తెలుసుకొని ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే లారీ వెనుక భాగంలో ఉన్న రెండు టైర్లు కాలిపోయాయి. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

దోమలు నివారణ మందులను పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

పార్వతీనగర్ కాలనీలో జ్వరాలు

ప్రజాశక్తి- పొందూరు

పట్టణంలో పార్వతీనగర్ కాలనీలో ఒకే ఇంటిలో ముగ్గురికి తీవ్రమైన జ్వరాలు బారిన పడడంతో కాలనీవాసులు అల్లాడిపోతున్నారు. కాలనీకి చెందిన సంజయ్, ప్రీతి, జ్ఞానేశ్వర్‌లు తీవ్రమైన జ్వరంతో పాటు ఒళ్లునొప్పులతో బాధపడుతుండంతో శ్రీకాకుళంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. వీరికి సంబంధించిన రక్త నమూనాలకు ప్రాథమిక పరీక్షలు నిర్వహించగా డెంగ్యూగా అనుమానం వ్యక్తం చేశారు. దీంతో చిన్నారుల రక్తనమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ఒక్కసారిగా ఇంటిలో ముగ్గురు చిన్నారులకు తీవ్రమైన జ్వరాలు సోకడంతో తాడివలస పిహెచ్‌సి సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఆస్పత్రి వైద్యులు డా.నవీన్ ఆధ్వర్యంలో కాలనీలో ఫాగింగ్ యంత్రంతో స్ప్రే చేసి దోమలు నివారణ చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయాన్ని అందజేస్తున్న దాతలు

నాయీబ్రాహ్మణులకు అండ

ప్రజాశక్తి- టెక్కలి

పట్టణంలో సుమారు 60 మంది నాయిబ్రాహ్మణులకు జిల్లాకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు దొంతికుర్తి త్రినాథరావు, నిర్మల దంపతులు ఔదార్యంతో మంగళవారం ఒకొక్క కుటుంబానికి రూ.5వేలు చొప్పున ఆర్థికసాయాన్ని అందించారు. సంఘంలోని నిరుపేద కుటుంబాలకు అందించిన సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో అచంట శ్రీనివాసరావు, కె.రామారావు, ఎస్.వెంకటరావు, పాపారావు, చిన్నారావు, అప్పారావు, ధర్మారావు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

శ్రీకాకుళం రూరల్: మండలంలోని గేదెలవానిపేట, కసిమవలస గ్రామాల్లో 20 కుటుంబాలు వైసిపిలో చేరారు. వీరికి మంగళవారం వైసిపి నాయకులు ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు పార్టీ కండువ వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు సిఎం జగన్మోహన్‌రెడ్డి వల్లే సాధ్యమన్నారు. సచివాలయం, వాలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చారని అన్నారు. గత ప్రభుత్వంలో పింఛను, రేషన్ ఇలా సంక్షేమ పథకాలు కావాలంటే జన్మభూమి కమిటీ సభ్యులు సిఫార్సులో వచ్చేవని అన్నారు. ఇప్పుడు దరఖాస్తు చేసుకుంటే చాలు... మధ్యవర్తి లేకుండా నేరుగా సంక్షేమ పథకం అమలవుతుందని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి చంద్రమౌళి, సాధు కామేశ్వరరావు, అప్పలరాజు, కోటేశ్వరరావు, కృష్ణ, రాంబాబు, సూర్యారావు, శ్యామసుందరరావు, రమేష్, సింహాచలం పాల్గొన్నారు.

జీవన ధ్రువపత్రాలు సమర్పించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లును వెంటనే సమర్పించాలని పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సురవరపు సిమ్మి నాయుడు, బొడ్డేపల్లి జనార్ధనరావు ఒక ప్రకటనలో కోరారు. సబ్ ట్రెజరీ కార్యాలయ పరిధిలో గల 1130 మంది సర్వీస్, ఫ్యామిలీ పెన్షనర్లకుగాను 969 మంది ఇప్పటివరకు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించారని, మిగిలిన 161 మంది పెన్షనర్లు వెంటనే లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని కోరారు. ఈనెల 29లోగా సబ్ ట్రెజరీ కార్యాలయంలో గాని నెట్ సెంటర్‌లో గానీ లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించాలని సబ్ ట్రెజరీ అధికారి ఎస్.సువర్ణ రాజు తెలిపినట్లు వారు తెలిపారు.

పరిశీలిస్తున్న విజయలక్ష్మి

మహిళా మార్టు వార్షికోత్సవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థలో నిర్వహిస్తున్న జగనన్న మహిళా మార్టు ఏడాది కాలంలో రూ.9.18 లక్షలు డివిడెండ్‌ను సాధించి స్వయంశక్తి సంఘాల బలోపేతానికి తోడ్పడిందని మెప్మా డైరెక్టర్ వి.విజయలక్ష్మి పేర్కొన్నారు. నగరంలోని రైతుబజారు వద్ద ఏర్పాటు చేసిన మహిళా మార్టు మంగళవారం ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులంతా తమ వాటాగా రూ.150 చెల్లించి మహిళా మార్టును ప్రారంభించడానికి దోహదపడ్డారని అన్నారు. మొత్తం వాటా ధనం రూ.27,54,600 పెట్టుబడిగా దీన్ని ప్రారంభించారని అన్నారు. ఈ ఏడాది ఈ మార్టు ద్వారా నికర ఆదాయం రూ.13,63,276 సాధించారని అన్నారు. వచ్చిన నికర ఆదాయంలో 35 శాతం డివిడెంట్ రూ.9,18,200 సంబంధిత స్వయం సహాయక సంఘాల సభ్యులకు చెల్లించారని అన్నారు. రిసోర్సు పర్సన్లు కష్టపడి పనిచేస్తూ ప్రజలకు సేవలందించడంతో పాటు వినియోగ దారులకు నాణ్యమైన సరకులు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో పలాసలో మరో మార్టు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది ఆర్.ఆదినారాయణ, శ్రీనివాసరావు, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆస్పత్రి సిబ్బంది

ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా రఘురాం

పలాస : పలాస ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌గా చొక్కర రఘురాం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన రఘురాంకు ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో పాటు మత్స్యకార వేదిక నాయకులు అంబటి ఆనంద్, డాక్టర్ జోగి గౌతమ్, కొమర దేవరాజు, చొక్కర నరహరి, బి.రాజు, తిర్రి రాజారావు, బొంపల్లి సునీలవర్మ, శ్రీనివాసరావులు శుభాకాంక్షలు తెలిపారు.

ఆరుతడి పంటలపై ప్రత్యేక దృష్టి

మాట్లాడుతున్న ఎడి లక్ష్మణరావు

ప్రజాశక్తి- బూర్జ

ఆరుతడి పంటలపై రైతులు దృష్టి సారించాలని భూగర్భ జలశాఖ ఎడి డి.లక్ష్మణరావు అన్నారు. మంగళవారం కురుంపేటలో ఆంధ్రప్రదేశ్ సమీకృత సాగునీరు వ్యవసాయ పరివర్తన పథకంలో భాగంగా యూత్ క్లబ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పంట నీరు ప్రణాళికపై కాశీ సాగరం ఆయకట్టు రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్కువ నీటితో పండించిన పంటలను వేసుకొని రైతులు ఉత్పత్తి, ఉత్పాదకతను మెరుగుపరుచుకోవాలని సూచించారు. చెరువుల్లో కుంటల్లో నీరు నిల్వ చేసుకుని చివర ఆయకట్టు దారునికి నీరు అందించేలా ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ జియాలజిస్ట్ రమా శ్రీదేవి, ఎపిడి లక్ష్మణరావు, సర్పంచ్ కొరికాన వెంకట శివ సాయి సీతారామరాజు, మాజీ సర్పంచ్ కొరికాన వెంకటరావు, రైతులు కత్తెర నర్సింగరావు, విక్రమ్ వాసు, అశోక్ కుమార్, యూత్ క్లబ్ ప్రతినిదులు లక్ష్మణరావు, ఉమామహేశ్వరరావు, కె.శ్రీరామ్, పరిసర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

నగరంపెల్లి గ్రామానికి చెందిన శిస్టు రామ్మూర్తి ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన కుటుంబానికి స్థానిక సర్పంచ్ దువ్వాడ పద్మావతి, పిఎసిఎస్ అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావు మంగళవారం సిఎం సహాయనిధి కింద రూ. 45 వేలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడు తూ పేద ప్రజలకు జగన్ అండగా నిలుస్తున్నార న్నారు. ఆర్థికసాయం అందడానికి కృషి చేసిన మంత్రి అప్పలరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి నాయకులు మామిడి గోపి, అప్పల నాయుడు, రామయ్య, జానకి రామయ్య పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : చెక్కు అందజేస్తున్న సర్పంచ్

ఇచ్ఛాపురం: పట్టణానికి చెందిన తెలుకుల కేశవ సాహు కిడ్నీ వ్యాధితో మృతి చెందడంతో ఆ కుటుంబానికి సిఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరైంది. సీడప్ ఛైర్మన్ శ్యామ్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. కేశవ సాహు కిడ్నీవ్యాధి బారినపడి కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగిన తరువాత కోలుకుని సాధారణ జీవితం గడిపాడు. ఈ మధ్యనే మరలా కిడ్నీ ఇన్ఫెక్షన్‌కు గురై వైద్యం చేసుకుని కొద్ది రోజుల క్రితం మరలా అనారోగ్యం పాలై మరణించారు. ఆయన వైద్యసహాయం కోసం రెండు నెలల క్రితం సిఎం సహాయ నిధికి ధరఖాస్తు చేరుకున్నారని, ప్రభుత్వం మంజూరు చేసిన రూ.లక్షా 50వేల చెక్కును కేశవ సాహు కుటుంబానికి అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ గోవిందా రెడ్డి, గవరయ్య, దిలీప్, శ్రీనివాస సాహు పాల్గొన్నారు.

ఎంపిడిఒలు బాధ్యతల స్వీకరణ

జి.సిగడాం : పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

జి.సిగడాం: మండల అభివృద్ధి అధికారిగా కె.వెంకన్న బాబు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. పాతపట్నం మండలం నుంచి జి.సిగడాం మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధి కోసం తనవంతు సహకారం అందిస్తానని, సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎస్. శ్రీనివాసరావు, ఎఒ రామకృష్ణ, కార్యదర్శి సాహు, ఎపిఒ సత్యన్నారాయణ, ఎలక్ట్రికల్ ఎఇ తిరుపతిరావు, సచివాలయ సిబ్బంది పి.రాము, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

లావేరు: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అధికారులు బదిలీలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా లావేరు మండల ఎంపిడిఒగా కె.ఎస్.కొండలరావు మంగళవారం విధుల్లో చేరారు. ఈయన ఇప్పటి వరకు మెళియాపుట్టి మండలంలో విధులు నిర్వహించారు. ఈ నెల 2న లావేరు ఎంపిడిఒగా విధుల్లో చేరిన జి.భాస్కరరావును మెళియాపుట్టి మండలానికి ఉన్నతాధికారులు బదిలీ చేశారు. గతంలో విజయనగరం పార్లమెంట్ పరిధిలో పని చేసిన కారణంగా భాస్కరరావును మెళియాపుట్టి బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

15 కేజీల గంజాయి స్వాధీనం

పలాస: కాశీబుగ్గ సాయిరాం సమీపంలో ఒడిషా రాష్ట్రానికి చెందిన ముగ్గురు వ్యక్తుల నుంచి 15 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడు తెలిపారు. ఒడిషా రాష్ట్రం గజపతి జిల్లా అలిగండ గ్రామానికి చెందిన రమేష్ నాయక్, ఒడిషా రాష్ట్రం రాయఘడ గొయిబండా గ్రామానికి చెందిన ఇస్మాల్ గంటా, ఒడిషా రాష్ట్రం ఆర్.ఉదయగిరి అటిలిమ గ్రామానికి చెందిన ప్రసాద్ కరాడ్ ఒడిషా ప్రాంతంలో గంజాయి సాగు చేస్తూ ఒడిషా నుంచి తమిళనాడు ప్రాంతానికి తరలించే సమయంలో కాశీబుగ్గ పోలీసులు సమాచారాన్ని తెలుసుకొని చాకచక్యంగా 15 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ సుమారు రూ 15 వేలు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు. పలాస డిటి రవికుమార్, ఎస్ఐతో పాటు హెచ్‌సి శ్రీనివాసరావు, సిబ్బంది బర్రి లోకనాధం, ఉషా కిరణ్, నీలకంఠం, భాస్కరరావు, కోదండ ఉన్నారు.

గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు